## సీతమ్మ పలికిన.. హనుమద్ మంత్రం

త్వమస్మిన్ కార్య నిర్యోగే ప్రమాణం హరిసత్తమ
హనుమాన్ యత్నమాస్థాయ దుఃఖక్షయ కరో భవ||

ఈ శ్లోకం వాల్మీకి రామాయణం సుందరకాండలోనిది. 'హనుమా! నేను చాలా దుఃఖంలో ఉన్నాను. నన్ను ఈ కష్టాల నుంచి గట్టెక్కించగల సమర్థుడవు నువ్వే!' అని తనకు రాముడి అభిజ్ఞాన్ని అందించిన హనుమంతుడితో చెబుతుంది సీతమ్మ. ఇది కార్యసిద్ధి హనుమాన్ మంత్రంగా ప్రసిద్ధికెక్కింది.

రామాయణంలో మంథర, శూర్పణఖ పాత్రలు కీలక పరిణామాలకు కారణమైనవి. మంథర దుర్బోధ వల్ల

హితోపదేశం



కైకేయి సాధించిందేమీ లేకపోగా భర్తను కోల్పోయింది. విధవగా శేషజీవితాన్ని గడిపింది. దురాశకు పోయిన శూర్పణఖ దుర్బోధ వల్ల రావణాసురుడు తన ప్రాణాలు కోల్పోవడంతోపాటు లంక సర్వనాశనానికి కారకుడయ్యాడు. దుర్భరమైన వియోగదుఃఖాన్ని అనుభవించినప్పటికీ సీతారాములు పరస్పర ప్రేమను, మానసిక స్థైర్యాన్ని కోల్పోలేదు. సీతమ్మ కోసం వనమంతా గాలిస్తూ రాముడు శోకిస్తే.. అశోకవనంలో రాక్షస స్త్రీల మధ్య అనుక్షణం రాముణ్ని తలుచుకుంటూ దుఃఖించింది సీతమ్మ. ఆ మహా ఇల్లాలిని అన్వేషిస్తూ అశోకవనం చేరుతాడు హనుమంతుడు. రాముడు తనకు ఇచ్చిన అంగుళీయకాన్ని సీతమ్మకు అందించాడు. 'సీతమ్మ తల్లీ! శ్రీరామచంద్రుడు లంకకు తప్పకుండా వస్తాడు. రావణ సంహారం గావించి మిమ్మల్ని తీసుకెళ్తాడు' అని భరోసా కల్పిస్తాడు. ఆ సందర్భంలో సీతమ్మతల్లి పై శ్లోకం పలికింది. దంపతుల ఎడబాటుకు ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ కారకులైన వారికి బ్రహ్మహత్యా పాతకం తగులుతుందని భాగవతం పేర్కొంది. ఆధునిక కాలంలో సైతం తాత్కాలిక ఆకర్షణలకు లోనవుతూనో, ఇతరుల దుర్బోధల ప్రభావంతోనో దాంపత్య సమస్యలను ఎదుర్కొంటున్న వారు సీతావియోగ ఘట్టం నుంచి నేర్చుకోవలసింది ఎంతో ఉంది. రాక్షసమాయలు, కుయుక్తులు తాత్కాలిక దుఃఖాన్ని వియోగాన్ని కలిగించినా.. దైవశక్తి విజృంభణ ముందు అవి నిలబడలేవు. అంతిమంగా ధర్మమే జయిస్తుంది. ధర్మాన్ని పట్టుకోవడమే మనం చేయాల్సింది. హనుమతో సీతమ్మ పలికిన మాటలు కార్యసిద్ధి మంత్రంగా మారాయి. ఆపత్కాలంలో, నిత్య విధిలో పై శ్లోకాన్ని యథాశక్తి పఠించినవారికి కార్యసిద్ధి కలుగుతుంది.

... డా|| చెప్పెల హరినాథశర్మ

## మూడు రోజులు.. నాలుగు పూటలు..

బుధవారం తొలి ఏకాదశి

**అనంత** ఫలాన్ని ఇచ్చే పుణ్యప్రదాయిని తొలి ఏకాదశి. ఈ పర్వదినం ఉపవాస ప్రధాన పండుగ. దశమి నాటి రాత్రి, ఏకాదశి రెండు పూటలు, ద్వాదశి రాత్రి ఉపవాసం చేయాలి. ఇలా త్రిరాత్ర ఉపవాస వ్రతం ఆచరించే విధానం ఉంది. మూడు రోజుల్లో నాలుగు పూటలు ఉపవాసాలు ఉండటం దీనిలోని ప్రత్యేకత. దశమి నాటి రాత్రి ముక్కోటి దేవతలు వైకుంఠానికి వెళ్లి.. మహావిష్ణువును అర్చిస్తారట. ఆ సమయంలో మనం కూడా ఉపవాసం పాటిస్తూ మహావిష్ణువును ధ్యానం చేస్తే.. సమస్త దేవతల అనుగ్రహం ప్రాప్తిస్తుందని విశ్వాసం. ఏకాదశి రోజు రెండు పూటలా ఉపవాసం ఉండి హరినామ సంకీర్తనలతో తరించాలి. మర్నాడు పగటిపూట పారణ చేయాలి. అంటే స్వామి ప్రసాదంగా భావించి సాత్విక ఆహారం తీసుకోవాలి. రాత్రికి మళ్లీ ఉపవాసం పాటిస్తే.. ఏకాదశి వ్రతం ముగుస్తుంది. ఈ ఉపవాస దీక్ష వెనుక వైద్యపరమైన విశేషాలు కనిపిస్తాయి. ఆషాఢం మొదలు వానలు పుంజుకుంటాయి. వాతావరణంలో ఊహించని మార్పులు వస్తుంటాయి. వాటిని తట్టుకొనేందుకు వీలుగా శరీరాన్ని సిద్ధం చేసుకోవడమే ఏకాదశి ఉపవాస దీక్ష లక్ష్యంగా చెబుతారు పెద్దలు. దీని ఫలితంగా రోగనిరోధక శక్తి పెరగడంతోపాటు జీర్ణకోశంలోని వ్యర్థాలు తొలగిపోతాయి. ఆ తర్వాతి కాలంలో వాతావరణ మార్పులకు శరీరం తట్టుకునేందుకు ఇది సాయపడుతుంది.

## జీవం.. పునరుత్థానం

క్రీస్తు సందేశం

**జీవం,** పునరుత్థానం అనేవి ప్రభువులో కనిపిస్తాయి. కొన్ని అద్భుతాల్లో జీవం అనేది నిరూపితమైతే, చనిపోయిన లాజరుని మళ్లీ బతికించిన ఘట్టంలో పునరుత్థానం రుజువైంది. 'నేనే మార్గం, సత్యం, జీవం' (యోహాను 14:6) అని ప్రకటించుకున్న ప్రభువే, 'నేనే పునరుత్థానం' (యోహాను 11:25-26) అని కూడా పేర్కొన్నాడు. క్రీస్తును ఎలాగైనా తప్పుపట్టాలని చూస్తున్న యూదు పెద్దల్లో.. ఈ రెండు మాటలూ మంటలు రేపాయి. నీళ్లను ద్రాక్షరసంగా మార్చడం, అంధునికి చూపునివ్వడం, తుఫాన్‌ను అణచివేయడం, ఐదు రొట్టెలు, రెండు చేపలు ఐదు వేలమందికి ఆహారంగా అందించడం తదితర సంఘటనల్లో క్రీస్తులోని జీవశక్తి ప్రస్ఫుటమైంది. రెండోది ఆయన మరణిస్తే గానీ తెలిసే అవకాశం లేదు. కానీ, ఓ సంఘటన కారణంగా ముందుగానే అది వ్యక్తమైంది. బెతానియా గ్రామంలో మరియ, మార్త అనే అక్కాచెల్లెళ్లు ఉండేవారు. వారికో సోదరుడు. అతని పేరు లాజరు. ఆ కుటుంబం ప్రభువుకి బాగా సుపరిచితం. ఒకసారి అకస్మాత్తుగా లాజరు చనిపోయాడు. ఆ సమయంలో ఎక్కడికో దూరప్రాంతానికి వెళ్లిన ఏసుక్రీస్తు నాలుగు రోజుల తర్వాత



బెతానియా చేరుకుంటాడు. తమ నివాసానికి వస్తున్న ప్రభువుకు మార్త ఎదురు వెళ్తుంది. మీరున్నట్లయితే నా సోదరుడు చనిపోయేవాడు కాదని కన్నీటి పర్యంతం అవుతుంది. ప్రభువును ప్రార్థించి 'నీ మహిమను ప్రకటించేందుకు' అని సమస్యను దేవుడి ముందు ఉంచింది. ప్రభువు అనుగ్రహించాడు. అక్కడి ప్రజల విశ్వాసం మరింత గట్టిపడేటట్టుగా సమాధి రాయి పక్కకు తొలగించి 'లాజరూ! వెలుపలికి రా!' అని పిలిచాడు ప్రభువు. చనిపోయిన వాడు లేచి, నడిచొచ్చాడు. అందరూ ఆ మహత్తర అద్భుత శక్తికి ఆశ్చర్యపడి ప్రభువును కొనియాడారు. (యోహాను 11:17-44)

... ప్రొ||బెర్నార్డ్ రాజు, 98667 55024



మంగళవారం నుంచి దక్షిణాయనం

# ప్రతిరోజూ ఆధ్యాత్మిక పర్వమే!

**కాలగణన గణితానికీ అంతుబట్టదు. లిప్తపాటులో జరిగిపోయే కాలానికి కళ్లెం వేయడం బ్రహ్మతరం కూడా కాదు. కాలం ఆధారంగా జీవనయానం చేసే మనుషుల కోసం మన రుషులు ఎంతో శోధించారు. కాలాన్ని గణించి.. కాలానుగుణంగా రుతువులుగా విభజించి ప్రకృతి ధర్మాన్ని అర్థం చేశారు. ఉత్తర, దక్షిణాయనాలుగా విడదీసి ఏ అయనంలో ఎటుగా పయనించాలో నిర్దేశించారు. ఇప్పుడు దక్షిణాయనానికి వేళ అయింది. ప్రకృతి విలక్షణంగా మారిపోయింది. ఉత్తరాయణం ముక్తికి మార్గమైతే.. ఆ దారికి చేరుకునే శక్తిని ప్రసాదించే పవిత్ర కాలం దక్షిణాయనం. ఈ పుణ్యకాలాన్ని ఆధ్యాత్మిక ప్రయాణానికి వినియోగించుకోవాలి.**

దక్షిణాయనం దేవతలకు రాత్రి సమయంగా చెబుతారు. రాత్రివేళ దుష్టశక్తులు బలం పుంజుకుంటాయి. దైవశక్తి కొంత సన్నగిల్లుతుంది. ప్రతికూల శక్తులు ప్రబలకుండా మానవ ప్రయత్నం అనివార్యం. దేవతల ప్రీత్యర్థం జపతపాలు చేయడం అత్యావశ్యకం. పారమార్థిక చింతన ఉన్నవారికి పర్వాలతో పనిలేదు. లౌకిక జీవనం కొనసాగించేవారికి అది సాధ్యపడదు. అందుకే, దక్షిణాయనంలో ప్రతినెలా విశేష పర్వదినాలు ఉండేలా మన రుషులు మార్గనిర్దేశం చేశారు. ఆషాఢం మొదలుకొని మార్గశిరం వరకు విశేష ఉత్సవాలు ఉండేలా పండుగలు వస్తుంటాయి.

### ప్రతి నెలా పండుగలే..

**దక్షిణాయనంలో** మొదటి పండుగ ఆషాఢ శుక్ల ఏకాదశి. దీనినే తొలి ఏకాదశి అనీ, దేవశయన ఏకాదశి అనీ అంటారు. ఆనాటి నుంచి కార్తిక శుక్ల ద్వాదశి వరకు శ్రీమహావిష్ణువు యోగనిద్రలో ఉంటాడు. స్థితికారుడు నిద్రపోవడం ఏంటి? బడలిక తీర్చుకోవడానికి మనుషులు పోయేలాంటి నిద్ర కాదిది. శ్రీహరిది యోగనిద్ర. నిద్రాణంలోనూ ఉత్థానస్థితిలోనే ఉంటాడు దేవాదిదేవుడు. తన స్థితికార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే.. తపోనిష్ఠలో కూరుకుపోతాడు. అలా పాలకడలిలోని శేషతల్పం నుంచి వచ్చే ధనాత్మక తరంగాలు ఈ విశ్వానికి రక్షణ ఛత్రంలా కాపుకాస్తాయని పూర్వికుల విశ్వాసం. ఆషాఢ పౌర్ణమి అత్యంత ప్రభావవంతమైన పర్వదినం.

**విష్ణురూపంగా** భావించే వ్యాస మహర్షి జన్మించినది ఈరోజునే. వేదాలను విభజించి, పంచమవేదమైన భారతాన్ని అందించి, అష్టాదశ పురాణాలు లిఖించి, భక్తి భావనకు ఆయువుపట్టుగా భావించే భాగవతాన్ని రచించి.. జగతిని జాగృతం చేసిన జగద్గురువు ఆ మహనీయుడు. వ్యాస మహర్షిని స్మరిస్తూ.. ఆయన ప్రతిరూపంగా గురువులను పూజించుకునే పండుగ ఇది. సాధకులు తమ తపోబలాన్ని పెంచుకునేందుకు అనువైన తిథి.

**దక్షిణాయనంలో** వచ్చే మాసాల్లో పవిత్రమైనది శ్రావణం. శివరూపంగా పేర్కొనే శ్రావణంలో మంగళగౌరి, మహాలక్ష్మి దేవతల పూజలు ఇంటింటా జరుగుతాయి. శ్రావణ వ్రతాలు ఆచరించడం వెనుక లౌకిక విశేషాలూ కనిపిస్తాయి. మనది వ్యవసాయ ఆధారిత దేశం. శ్రావణంలో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటాయి. వ్యవసాయ పనులు జోరందుకుంటాయి. పూర్వం మగవాళ్లు శ్రావణం వచ్చిందంటే.. పొలం పనుల్లోనే నిమగ్నమయ్యేవారు. కర్తవ్యదీక్షలో ఉన్న పతులకు దైవీబలం సంప్రాప్తించాలనే భావనతో భార్యలు వ్రతాలు ఆచరించే సంప్రదాయం ఏర్పడింది. ఈ వ్రతాల్లో భాగంగా ఇచ్చిపుచ్చుకునే వాయనాల్లో పచ్చి శనగలు ప్రధానంగా కనిపిస్తాయి. వర్షరుతువులో శరీరానికి మాంసకృత్తుల అవసరం అధికంగా ఉంటుంది. పచ్చిశనగల ద్వారా కావాల్సినన్ని ప్రొటీన్లు లభిస్తాయి. వ్రత నియమాల్లో భాగంగా ఉపవాసం కూడా దేహ సాధనకు తోడ్పడుతుంది.

> సూర్యుడు భూమికి దక్షిణ దిశలో సంచరించే మూడు రుతువుల (ఆరు నెలలు) కాలాన్ని దక్షిణాయనమనీ, భూమికి ఉత్తరదిశలో సంచరించే మూడు రుతువుల కాలాన్ని ఉత్తరాయణమని పేర్కొన్నారు. సూర్యుడు మేషరాశి మొదలుకొని ప్రతినెలా ఒక్కొక్క రాశిలో సంచరిస్తూ ఉంటాడు. సూర్యుడు మకరంలోకి ప్రవేశించింది మొదలు మిథునం దాటే వరకుగల ఆరు నెలల కాలాన్ని ఉత్తరాయణం అని, కర్కాటక సంక్రమణం మొదలు ధనుస్సు దాటే వరకూ ఉన్న ఆరునెలల కాలాన్ని దక్షిణాయనం అని విభజించారు. ఉత్తరాయణం శుభ కార్యాలకు అనువైనదైతే.. దక్షిణాయనం ఉపాసకులు అనుష్ఠానం చేసుకోవడానికి విశేషమైనదిగా చెబుతారు.

**శ్రావణంలో** కృష్ణాష్టమిని అంగరంగ వైభవంగా చేసుకుంటారు. బాలకృష్ణుడి ఆరాధనతో సంతానం సంప్రాప్తిస్తుందనీ, ఐశ్వర్యం సిద్ధిస్తుందనీ విశ్వాసం. భార్యాభర్తల అన్యోన్యతకు శ్రీకృష్ణ ఆరాధన చేసుకోవాలని పెద్దల మాట. సోదరీ, సోదరుల మధ్య అన్యోన్యతను పంచుకునే రక్షాబంధన్‌ను శ్రావణ పౌర్ణమి నాడు చేసుకుంటారు. అనుబంధాలను పంచుకునే పండుగ ఇది.



**భాద్రపదం** గణపతి మాసం. వినాయక మంటపాలతో దేశమంతా ఆధ్యాత్మికతకు చిరునామాగా మారిపోతుంది. భక్తిభావంతోపాటు ఐక్యతను చాటిచెప్పే పండుగ ఇది. భాద్రపద కృష్ణపక్షం పితృదేవతల ఆరాధనకు కేటాయించారు పెద్దలు. ఉత్తరాయణం దేవతలు అనుగ్రహిస్తే, దక్షిణాయనం పితృదేవతల ఆశీస్సులు అందుతాయని శాస్త్ర వచనం. పితృపక్షాల్లో పితృ తర్పణాలు విడవడం మన సంప్రదాయం. కాలం చేసిన పెద్దలను తలచుకొని.. వారి పేరిట శక్తి కొద్ది దానధర్మాలు చేయాలని శాస్త్రం నిర్దేశించింది. ఆ ప్రకారంగా దానం చేసిన వారి వంశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నది.



**ఆశ్వయుజం** ఆధ్యాత్మిక సాధకులకు ప్రీతికరమైన మాసం. తెలంగాణ ఆడబిడ్డలకు ముచ్చటైన మాసం కూడా ఇదే. దేవీ నవరాత్రులు శాక్తేయుల శక్తిసామర్థ్యాలు పెంచుకునే కాలం. బతుకమ్మ కోలాహలం ఆడబిడ్డల ఆనందాలు పంచుకునే సమయం. చెడును ఎదిరించి నిలిచిన మంచికి పట్టం కడుతూ దసరా ఉత్సవాలు చేసుకుంటారు. అమ్మవారి అనుగ్రహం పొందే అద్భుత పర్వం విజయదశమి. ఆశ్వయుజ అమావాస్యను దీపావళిగా చేసుకుంటాం. దీపాలు వెలిగించి చీకట్లను తొలగించుకుంటాం. మానవ మనుగడకు మూలాధారమైన సంపదల తల్లి మహాలక్ష్మిని ఆరాధించి ఆమెకు కృతజ్ఞతలు చెప్పుకొంటాం.



**కార్తికం** పవిత్ర మాసం. అద్వైత భావాన్ని తెలియజేసే నెల ఇది. శివకేశవులను ఆరాధిస్తూ ధన్యత పొందుతారు భక్తులు. పరమేశ్వరుడికి నిత్యాభిషేకాలు, శ్రీహరికి నిత్య నివేదనలు.. నెలంతా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. కార్తికంలో వనభోజనాలు ఆహ్లాదంతోపాటు భక్తి భావాన్ని పెంపొందిస్తాయి.



**మార్గశిరం** మరో మహోన్నత మాసం. గీతాచార్యుడు మాసాల్లో తాను మార్గశిరాన్ని అని ప్రకటించాడు. భగవద్గీత ఆవిర్భవించింది కూడా ఈ నెలలోనే. అంతేకాదు శివుడి రూపమైన కాలభైరవుడు ఆవిర్భవించిందీ మార్గశిరంలోనే!

ఇలా ప్రతినెలా పర్వాలతో కొనసాగే దక్షిణాయనం విలక్షణం కాక మరేమిటి? ఉత్తరాయణంలో ఉత్తమ మార్గం పొందడానికి కావాల్సిన శక్తిని పుంజుకోవడానికి దక్షిణాయనాన్ని వినియోగించుకోవాలి.

... కణ్వస

## జ్ఞానయజ్ఞం.. ద్రవ్యయజ్ఞం..

శ్రేయాన్ ద్రవ్యమయాద్యజ్ఞాత్ జ్ఞానయజ్ఞః పరంతప|
సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే||

(భగవద్గీత 4-33)

'అర్జునా! లోక కల్యాణం కోసం సర్వసమర్పణ భావనతో ఆచరించేది 'యజ్ఞం'. ద్రవ్యయజ్ఞాలని, జ్ఞానయజ్ఞాలని రెండు విధాలుగా చెప్పిన యజ్ఞాలలో ద్రవ్యయజ్ఞం కన్నా జ్ఞానయజ్ఞం ఉత్తమమైనది. కర్మలన్నీ జ్ఞానంలోనే పరిసమాప్తమవుతాయి' అంటాడు కృష్ణుడు. కఠోపనిషత్తు మనముందు 'ప్రేయో మార్గం, శ్రేయో మార్గం' అని రెండు మార్గాలను ఉంచింది. భౌతిక జగత్తులో సంపదలను పొంది విలాసవంతమైన జీవితాన్ని గడపడం ప్రేయోమార్గం. జీవన పరమార్థాన్ని తెలుసుకొని, సంతృప్తితో కూడిన విజయసాధనతో అర్థవంతం, ఫలవంతం, ఉత్తమమైన జీవితాన్ని గడపడం శ్రేయో మార్గం. మానవులకు ద్రవ్యయజ్ఞాలు ప్రేయస్సునిస్తే, జ్ఞానయజ్ఞాలు శ్రేయస్సునిస్తాయి. శ్రేయస్సులో ప్రేయస్సు కూడా అంతర్లీనంగా ఉంటుంది. అందుకే ఆరంభంలోనే 'శ్రేయాన్' అంటూ ఆరంభించాడు పరమాత్మ.

సనాతన ధర్మం భౌతిక సంపదను అమితంగా సృష్టించమని, దానిని అర్హత ప్రాతిపదికగా సద్వినియోగం చేయమని చెబుతుంది. సంపదలను సమాజానికి వినియోగించడం, హోమాదులు నిర్వహించడం ద్రవ్యయజ్ఞంగా పేర్కొంటారు. హోమాదుల నిర్వహణలో 'కామన' ఉంటుంది. అలాగే త్యాగంలో 'నేను' చేస్తున్నాననే భావన ఉంటుంది. సాధారణంగా 'నీది.. నాది' అనే భేదభావన భౌతిక వస్తువులను ఆశ్రయించి ఉంటుంది. అవే అహంకార మమకారాలకు మూలద్రవ్యాలు. ఎప్పుడైతే సమాజం నుంచి పొందిన సంపదను సమాజానికే అర్పించాలనే భావన కలుగుతుందో, అప్పుడు ఆ సంపదలపై వ్యామోహం పోతుంది. పరోపకార బుద్ధి జాగృతమైన వేళ సమభావన వికసిస్తుంది. దానితో అభ్యుదయంతో కూడిన ప్రశాంతత మనసులో నిలుస్తుంది. అదే భౌతిక విజయానికి సోపానమవుతుంది.




ద్రవ్యయజ్ఞం వల్ల స్వర్గభోగాలు లభిస్తాయి. ఆర్జించిన సంపదలు తరిగిపోయినట్లుగానే, 'నేను' చేస్తున్నాననే భావనతో చేసే ద్రవ్యయజ్ఞ గత భోగాలూ కాలక్రమేణా తరిగిపోతాయి. అయితే.. కర్తృత్వభావనకు దూరంగా 'పనిని ప్రేమిస్తూ, ఉపాసనాభావన'తో చేసే కర్మల ఫలితం మాత్రం అహంకార మమకారాలను దరిచేరనీయదు. ఆ స్థాయిని పొందేందుకు ఉపకరించేదే జ్ఞానయజ్ఞం. నిజానికి.. ద్రవ్యయజ్ఞం లేనిదే జ్ఞానయజ్ఞం ఉండదు. కాకపోతే.. ద్రవ్యయజ్ఞంతో ఆగక జ్ఞానయజ్ఞాన్ని ఆచరించే వారికే శ్రేయస్సు కలుగుతుంది.

విషయాన్ని తెలుసుకోవడం జ్ఞానం. అది ఉత్తమమే కాని దానిని ఆచరణయోగ్యంగా మలచుకోవడం విజ్ఞానం అవుతుంది (విశేషతో జ్ఞానం విజ్ఞానం). విజ్ఞానం వల్ల ప్రయోజనం ఉంటుంది. చేసే ప్రతికర్మా ఫలితాన్ని ఇస్తుంది. అది సమాజహితమైనదా కాదా అనేదానిపై ఆ పని మంచిదా చెడ్డదా అనేది ఆధారపడి ఉంటుంది. చెడుపనుల వల్ల చెడు అనుభవాలు, మంచిపనుల వల్ల మంచి అనుభవాలు కలుగుతాయి. ఈ అనుభవాలే జ్ఞానాలుగా చెప్పుకొంటాం. ఆయా అనుభవాలు ప్రాతిపదికగా.. ఏది ఆచరణీయమో గుర్తెరిగి, కర్మఫల త్యాగంతో చేసే కర్మలు పరిణతినిస్తాయి. ఆ పరిణతి కాలక్రమేణా అభ్యాసమై... నిష్కామకర్మలకు మార్గం చూపుతుంది. నిష్కామకర్మలే యోగంగా మారి శ్రేయస్సునిస్తాయి. జీవితాన్ని భోగమయంగా కాక సాధనాపర్వంగా చేసుకోవడం వల్ల జీవన ప్రయోజనం సిద్ధిస్తుంది. ఈ ప్రయాణంలో ఇష్టాయిష్టాలు ప్రలోభపెడతాయి. వాటిని అధిగమించి.. ద్రవ్యయజ్ఞం నుంచి జ్ఞానయజ్ఞం వైపు నడవడం మానవులకు కర్తవ్యం కావాలి. కర్మఫలాన్ని కోరకుండా సత్కర్మలను యజ్ఞాలుగా ఆచరించడం వల్ల శ్రేయస్సు కలుగుతుంది.

... పాలకుర్తి రామమూర్తి

## త్యాగనిరతిని స్మరిస్తూ..

బుధవారం మొహర్రం



**ఇస్లామీయ** చరిత్రలో ఎంతో పవిత్రత, ప్రాధాన్యం ఉన్న యౌమె ఆషూరా రోజునే హజ్రత్ ఇమామె హుసైన్ (రజి) అమరులయ్యారు. వందల సంవత్సరాల క్రితం న్యాయం కోసం, ధర్మం కోసం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ఆయన పరివారమంతా 'కర్బాలా' మైదానంలో ప్రాణాలను పణంగా పెట్టి వీరోచితంగా పోరాడింది. కర్బలా ఘటన మనకు త్యాగస్ఫూర్తి పాఠాన్ని నేర్పుతుంది. దుర్మార్గాలపై, దౌర్జన్యాలపై రాజీలేని పోరాటాలు చేయాలని తెలుపుతుంది. ఆనాటి ఘటనను తలుచుకుంటూ ముస్లింలు మొహర్రం జరుపుకొంటారు. ఇమామె హుసైన్ (రజి) త్యాగస్ఫూర్తిని స్మరించుకుంటారు.

... ముహమ్మద్ ముజాహిద్
96406 22076

### ఇమామ్ హుసైన్ (రజి) సూక్తులు..

- ప్రపంచంలోనే స్వర్గాన్ని చూడాలనుకుంటే.. మీ అమ్మ ఒడిలో తలపెట్టి పడుకోండి.
- నేలపై వినమ్రంగా జీవించండి. చనిపోయాక నేలకింద హాయిగా ఉండవచ్చు.
- ఏ దిక్కూ లేని వారికి దేవుడే దిక్కు. అలాంటి వారిపై దౌర్జన్యం చేయకండి.
- నాకు స్వర్గ కాంక్ష కన్నా నమాజ్ అంటే ఎంతో ఇష్టం. ఎందుకంటే నమాజ్ అల్లాహ్‌కు ఎంతో ప్రీతి.
- ఈ దేహానికి మరణం తప్పదు. అలాంటప్పుడు ఈ జీవితాన్ని ప్రసాదించిన ఆ దైవం కోసం ప్రాణాలర్పించడమే మేలు.
- మిమ్మల్ని చెడు నుంచి వారించే వారే మీ నిజమైన శ్రేయోభిలాషి.
- మీ మనో న్యాయస్థానంలోకి వెళుతూ ఉండండి. ఎందుకంటే అక్కడ తప్పుడు తీర్పులు జరగవు.
- దైవదాస్యం చేసేవారికి ఈ ప్రపంచంలో ప్రతిదీ బానిసవుతుంది. దైవభీతితో గౌరవమర్యాదలను సాధించండి.
- దౌర్జన్యానికి వ్యతిరేకంగా పోరాడటంలో ఎంత అలక్ష్యం చేస్తావో... అంతే త్యాగం చేయాల్సి ఉంటుంది.
- ఏకాంతంలో ఉన్నప్పుడు పవిత్ర భావాలు గలిగినవాడే నిజమైన ముస్లిం.